మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి



నిజాంపేట్: ప్రకృతి హితమే పండుగల పరమార్థమని, పర్యావరణ రహిత గణపతులకు ప్రాధాన్యమిద్దామని కమిషనర్ సాబేర్ అలీ పిలుపునిచ్చారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రుల సంబరాల సందర్భంగా ప్రజలు పర్యావరణ రహిత మార్గాలను అవలంబించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలు నీటి కాలుష్యానికి కారణమవుతాయని, మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణాన్ని రక్షించడంలో ఎంతో సహాయపడతాయని అన్నారు.

నిమజ్జనానికి తాత్కాలిక నీటి కొలను ఏర్పాటు



రంగారెడ్డినగర్: గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు నుంచి విగ్రహాల నిమజ్జనాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న హెచ్ఎంటీ గ్రౌండ్‌లో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా తాత్కాలిక నీటి కొలన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చింతల్, గణేశ్‌నగర్, ఐడీపీఎల్, జగద్గిరిగుట్ట, రంగారెడ్డినగర్‌లతో పాటు కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలను ఈ కొలన్‌లో నిమజ్జనాలు చేయనున్నారు.

మదర్ థెరిస్సా స్ఫూర్తిని కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

నిజాంపేట్: ప్రపంచ వ్యాప్తంగా మానవసేవకు ప్రాణం అర్పించిన మదర్ థెరిస్సా అభాగ్యుల పాలిట దైవ స్వరూపమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు అన్నారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిజాంపేట్‌లోని వారి కార్యాలయంలో నివాళులర్పించారు. కారుణ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రూన్సీ రాణి, ప్రతినిధులు రాహుల్, కిరణ్ శారద, సుధారాణి, జానకి, సునీత, కిరణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డీఈఓ విజయకుమారి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ సెక్షన్లలో 'ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్' 'ఆయా' ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ప్రకటించారు. ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు కనీస అర్హత ఇంటర్ లేదా సమానమైన అర్హతను కలిగి ఉండాలన్నారు. శిశు విద్య లేదా ప్రైమరీ టీచింగ్‌లో అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. 18 నుంచి 44 ఏళ్లు ఉండాలన్నారు.
– ఆయా పోస్టులకు కనీస అర్హత 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని డీఈఓ తెలిపారు. 18 నుంచి 44 ఏళ్లు ఉండాలని వివరించారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం ఒక విద్యా సంవత్సరానికి 10 నెలలు మాత్రమే చెల్లించబడుతుందన్నారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు.

మట్టి వినాయకులను పూజించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల జల వనరులు కాలుష్యం అవుతాయని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. విఘ్నాలు, సమస్యలు తొలగించి సకల శ్రేయస్సులు చేకూర్చాలని కోరుతూ.. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ మనుచౌదరి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రాంతీయ కార్యాలయం వారు రూపకల్పన చేసిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. మట్టి గణపతి ప్రతిమలను కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలకు కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, పరిపాలనాధికారి రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త లింగయ్య, ప్రాజెక్ట్ అనలిస్ట్ రాకేష్ పాల్గొన్నారు.

ఆయా పాఠశాలల్లో వేడుకలు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. దయుంచయ్య దేవ.. మాకు అండదండా నీవేనయ్యా అంటూ ప్రజలు గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కుత్బుల్లాపూర్‌లోని పలు కాలనీల్లో ఇప్పటికే ప్రజలు మండపాలను విద్యుద్దీపాలు, ఆకులు, పూలతో అలంకరించారు. పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ చేశారు.

– జీడిమెట్ల



సుచిత్ర వాసవిక్లబ్ ఆధ్వర్యంలో..



భూదేవిహిల్స్ పరపతి సంఘం ఆధ్వర్యంలో..

మట్టి విగ్రహాల పంపిణీ



గాజులరామారం ఎస్పీఆర్ గ్లోబల్ స్కూల్‌లో..



సుభాష్‌నగర్ బోధివృక్ష ఒలంపియాడ్ స్కూల్‌లో



ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో మట్టి విగ్రహాల పంపిణీ



సూరారం నార్త్‌సిటీ స్కూల్‌లో..



కొంపల్లి ప్రత్యేక అధికారి చంద్రమోహన్ ఆధ్వర్యంలో..

దరఖాస్తులను పరిశీలించి సత్వరమే జారీ చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నిజాంపేట్: వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా సత్వరమే జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం రెవెన్యూ రికార్డులను, పరిపాలన పరమైన రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కులం, లోకల్, ఆదాయం ఇతరత్ర సర్టిఫికెట్ల జారీ నిమిత్తం దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పూల్‌సింగ్, మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్‌ప్రసాద్, ఆర్ఐలు రేణుక, భానుచందర్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఆటిజం, వృద్ధాశ్రమాలకు అనుమతి తప్పనిసరి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆటిజం సెంటర్లు, వృద్ధాశ్రమాలను నిర్వహించడానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సంక్షేమశాఖ అధికారిణి శారద తెలిపారు. నూతనంగా నిర్వహించాలనుకున్న ఆటిజం సెంటర్లు, ఓల్డ్ ఏజ్ హోం కేంద్రాల నిర్వాహకులను తక్షణమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహించే వాటిపై నియమనిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

సుభాష్‌నగర్: సూరారంలోని లింగా చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్‌కుమార్, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్, ఈఈ కిష్టప్పతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రతి ఏటా జరిగే గణేష్ నిమజ్జనం గురించి స్థానిక సీఐ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ఏడాది 3500 విగ్రహాలు నిమజ్జనం అయినట్లు డీసీపీకి తెలిపారు. నిమజ్జనంలో మూడు రోజులపాటు భారీ వాహనాలను బాదురుపల్లి భౌరంపేట్ సూరారం విలేజ్ మీదుగా మళ్లిస్తారని ఆయన దష్టికి తీసుకువచ్చారు. నిమజ్జనంలో డ్రోన్ ద్వారా ఎప్పటికప్పుడు వాహనాల రద్దీని తెలుసుకుంటూ క్లియర్ చేయనున్నట్లు స్థానిక సీఐ శ్రీనివాస్ డీసీపీకి వివరించారు.



వివరాలు తెలుసుకుంటున్న ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్

బదిలీ అయినా సీటు వదలడం లేదు!



నిజాంపేట్: కార్పొరేషన్‌లో శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని సుకృతా రెడ్డి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు తాత్కాలికంగా బదిలీ అయ్యింది. అయినా సదరు ఉద్యోగి మాత్రం నిజాంపేట్‌ను వదలడం లేదు. కింది స్థాయి సిబ్బందిని వేధింపులకు గురి చేస్తుందన్న కారణంగా సీడీఎంఏ కమిషనర్ (కమిషనర్ అండ్ డెరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) గత నెల 30న బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ సదరు ఉద్యోగి ఇక్కడే ఎందుకు పని చేస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. చెత్త ట్రాక్టర్ల బిల్లులు చెల్లింపు అంశాలల్లో బాధితుల నుంచి డబ్బులు సైతం డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయ వాహనాల్లో ఇంధన చెల్లింపు విషయంలో సైతం అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై కమిషనర్ సాబేర్ అలీని వివరణ కోరగా కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సిబ్బంది అత్యవసర సేవాలు అందించేందుకు ఆమెను రిలీవ్ చేయలేదని, వెంటనే రిలీవ్ చేస్తామని తెలిపారు

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతి



జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ రఘుపతికి వినతి పత్రం అందజేస్తున్న మహ్మద్ ఉస్మాన్ తదితరులు

రంగారెడ్డినగర్: గురుమూర్తినగర్ ప్రవేశంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని మైనార్టీ సెల్ నాయకుడు మహ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డీఈకి వినతిపత్రం అందజేశారు. గురుమూర్తినగర్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో నాలుగు రోడ్ల కూడలి కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక వైపు ఆదర్శ్‌నగర్, మరో వైపు గుడెన్‌మెన్, ఇంకో వైపు గురుమూర్తినగర్, ఐడీపీఎల్ రోడ్లు కలుస్తున్నందున చీకట్లో వాహనదారులు అకస్మాత్తుగా వస్తే కనిపించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి

జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఉపాధ్యాయులు పదోన్నతి ప్రక్రియలో భాగంగా మంగళవారం ఎస్‌జీటీ దాని తత్సమానమైన కేటగిరీలకు చెందిన 75 మంది ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల వివరాలను అధికార గ్రూపు నందు పొందుపరిచినట్లు వివరించారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు



మండల స్థాయి క్రికెట్ పోటీలలో ఎంపికైనా అండర్ 14, అండర్ 17 విద్యార్థులు

చింతల్: క్రీడలు విద్యార్థుల క్రమశిక్షణ, ఒత్తిడిని తట్టుకునే గుణాలను ప్రోత్సహించేందుకు ఎంతో దోహదపడతాయని ఎస్‌జీఎఫ్ఐ కుత్బుల్లాపూర్ జోనల్ ఇన్‌చార్జి అరుణ జ్యోతి అన్నారు. మంగళవారం హెచ్ఎంటీ కాలనీలోని ఆర్‌డీఎస్ క్రికెట్ అకాడమీలో కుత్బుల్లాపూర్ మండల స్థాయి క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రికెట్ వల్ల విద్యార్థుల మధ్య పోటీతోపాటు చదువుపై ఏకాగ్రత, ఒత్తిడిని జయించడం, పట్టుదల, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అండర్–14, అండర్–17 విద్యార్థులకు నిర్వహించారు. అండర్ 14 నుంచి 21 మంది విద్యార్థులు, అండర్ 17 నుంచి 25 మంది విద్యార్థులను సెలెక్టర్ల కమిటీ ఎంపిక చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ క్రికెట్ అకాడమీ చైర్మన్ కృష్ణ, వివిధ పాఠశాలల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద ప్రజలపై ఆస్తి పన్ను భారం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పేద ప్రజలు నివసించే బస్తీల్లో ఆస్తి పన్ను పేరిట భారం మోపకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజుల రామారం సర్కిల్ ఎన్టీఆర్ నగర్ బస్తీ వాసులతో కలిసి మంగళవారం ఉప కమిషనర్ మల్లారెడ్డిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. 60 గజాల్లో ఉన్న గృహాలకు ఆస్తి పన్ను పెంచితే పేద ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని, జరిమానాలు విధించే విషయంలో ఆలోచించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో మాట్లాడాలని కోరారు. కార్పొరేటర్లు కొలుకుల జగన్, విజయ్ శేఖర్ గౌడ్, మంత్రి సత్యనారాయణ, సీనియర్ నాయకులు మహ్మద్ రఫీక్, మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, మన్నే బాలేష్, సత్తి రెడ్డి, సిద్ధికి, గుబ్బాల లక్ష్మీనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తితే సిబ్బందిని సంప్రదించాలి

మేడ్చల్ విద్యుత్ డీఈ జాన్ పోతరాజు

కుత్బుల్లాపూర్: గణేశ్ మండపాల విద్యుత్ కనెక్షన్‌లు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు తమ సిబ్బంది అందుబాటులో ఉన్నారని మేడ్చల్ విద్యుత్ డీఈ జాన్ పోతరాజు అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గణేశ్ మండపాలతో పాటు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్, కొంపల్లి ఏఈ శ్రీనివాస్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ మండపాల వద్ద ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే తమ సిబ్బంది సంప్రదించాలన్నారు. అదే విధంగా వీధి దీపాలు వెలగకపోయినా, ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.



కొంపల్లి మున్సిపల్ సెంట్రల్ పార్కులో పర్యటిస్తున్న మేడ్చల్ డీఈ జాన్ పోతరాజు

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

సుభాష్‌నగర్: వినాయక విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం సూరారం కట్టమైసమ్మ చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను ఏసీపీ శంకర్‌రెడ్డి, సూరారం సీఐ సుధీర్‌కృష్ణలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. చెరువు వద్ద ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుతో పాటు భారీ క్రేన్‌లను అందుబాటులో ఉంచామని, నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యేంత వరకు వరకు తమ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు. చెరువు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి 24 గంటల పాటు మానిటరింగ్ చేస్తున్నామని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా ముగిసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఎన్ఎస్‌కేకే జూనియర్ కళాశాల జట్టు

దుండిగల్: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గాగిల్లాపూర్‌కు చెందిన ఎన్ఎస్‌కేకే జూనియర్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 21 నుంచి 25వ తేది వరకు జరిగిన పోటీల్లో ఏడు మ్యాచ్‌లను వరుసగా గెలిచి విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో ఐడీపీఎల్‌కు చెందిన శ్రీవిద్యా జూనియర్ కళాశాల జట్టుపై ఎన్ఎస్‌కేకే జట్టు విజయ సాధించింది. ఎన్ఎస్‌కేకే బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో శ్రీవిద్యా జూనియర్ కళాశాల జట్టుకు కేవలం 37 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఎస్‌కేకే ఓపెనర్ విఘ్నేష్, ప్రదీప్‌లు 3 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించి జట్టును గెలిపించారు. ట్రోఫీని కైవసం చేసుకున్న ఎన్ఎస్‌కేకే జట్టు సభ్యులను విద్యా సంస్థల చైర్మన్ ఉత్తమ నాయర్, సెక్రటరీ బాబు ఉన్నున్ని, అధ్యాపక బృందం అభినందించారు.



క్రికెట్ ట్రోఫీతో ఎన్ఎస్‌కేకే జట్టు సభ్యులు

ప్రజలకు అసౌకర్యం కల్పించొద్దు !

సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రతిపాదనలపై పునరాలోచించాలన్న బీజేపీ

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదించిన సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలకు అసౌకర్యంగా ఉంటాయని, ఆ ప్రతిపాదనపై పునరాలోచన చేసి, ప్రస్తుతం ఉన్న చోటే అన్ని సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించాలని బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి రూరల్, అర్బన్ జిల్లా కమిటీల అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం 'ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్' అధికారికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న చోటే సకల సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

◆ ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11కు కుదించడం ఏ మాత్రం సబబు కాదన్నారు. నగరంలో కూడా వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కుదించడం సరికాదన్నారు.



◆ ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 100 మందికి పైగా ప్రజలు వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, కూర్చోవడానికి కూడా వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.

◆ 3 నుంచి 4 కార్యాలయాలను ఒకే చోటుకి తరలిస్తే కనీసం 500 నుంచి 1000 మంది ఒకే చోటకు చేరుకోవాల్సి వస్తుందన్నారు. ఇది ప్రజలకు దూరం పెరగడమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు, వందల మంది ఒకే చోటుకు చేరే అవకాశం ఉంటుందన్నారు. అందుకే కార్యాలయాలను మరింత వికేంద్రీకరించాలే.. తప్పా.. కేంద్రీకరించకూడదన్నారు.

◆ ఇది మండలాలను కుదించి తాలుకాలుగా ఏర్పాటు చేయడం మాదిరి అవుతుందన్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రతి మండలంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న కారణంగా అక్కడే కార్యాలయాలు నిర్మించడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి, రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యుడు ప్రతాప్ తదితరులున్నారు.